


నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, సోమవారం 18 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM


# ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు

- ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూం
- సి-విజిల్ యాప్ ద్వారానూ ఫిర్యాదుల స్వీకరణ
- కోడ్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల బృందం
- విలేకర్ల సమావేశంలో ఖమ్మం కలెక్టర్ వి.పి.గౌతమ్
- రూ.50వేలకు పైగా నగదుకు ధ్రువపత్రాలు తప్పనిసరి: సీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, మార్చి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని కలెక్టర్ వీపీ గౌతమ్ హెచ్చరించారు. ఖమ్మం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం సీపీ సునీల్‌దత్‌తో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం లోక్‌సభా స్థానం పరిధిలో జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, భద్రాద్రి జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయన్నారు. లోక్‌సభా ఎన్నికలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఇదే రోజు నుంచి ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్ల స్వీకరణకు ఇదే నెల 25వ చివరి తేదీ ఆఖరు అన్నారు. 29న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. మే 13న ఎన్నికలు, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఇదే నెల 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఉల్లంఘనల ఫిర్యాదులు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదుదారులు సి-విజిల్ యాప్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని ప్రకటించారు. యంత్రాంగం వెంటనే రాజకీయపరమైన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించాలన్నారు. గోడలపై ఉన్న పొలిటికల్ పబ్లిసిటీ రాతలపై అక్షరాలు కనపడకుండా పెయింట్ వేయాలన్నారు. కోడ్ అమలును ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్టీ, వీఎస్టీ, ఎంసీఎంసీ బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. నామినేషన్ల స్వీకరణకు 10 రోజుల ముందు వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ అతిథి గృహాలు, హెలీప్యాడ్, ప్రభుత్వ మైదానాలను ఫస్ట్ కమ్ ఫస్ట్‌కి కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు సి-విజిల్ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. సీపీ సునీల్ దత్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందలో ఒక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, పోలీస్, వీడియో గ్రాఫర్లు ఉంటారన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా తప్పుడు సందేశాలు పోస్ట్ చేస్తే చర్యలు తప్పవన్నారు. కోడ్ ముగిసే వరకు ప్రజలు సరైన ధ్రువపత్రాలతో నగదు తరలించాలన్నారు. సరైన పత్రాలు లేకుండా నగదును సీజ్ చేస్తామన్నారు. రూ.50 వేలకు పైగా నగదుకు పత్రాలు తప్పనిసరి అన్నారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా, రెవెన్యూ, ఇన్‌కం ట్యాక్స్, సేల్స్‌ట్యాక్స్ డిపార్టుమెంట్ల సమన్వయంతో రాష్ట్ర, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆధారాలు లేకుండా సీజ్ అయిన నగదు విషయమై అప్పీల్, దరఖాస్తు కోసం కలెక్టరేట్‌లోని మొదటి అంతస్థులో జిల్లా వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి కార్యాలయాలను సంప్రదించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్‌నాయక్, జడ్పీ సీఈవో వినోద్, శిక్షణ ఐఏఎస్‌లు మయాంక్ సింగ్, యువరాజ్, శిక్షణ ఐపీఎస్ మౌనిక, డీపీఆర్వో గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పదోతరగతి పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 170 పరీక్షా కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న విద్యార్థులు 18,918 మంది
- తొలిసారిగా సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

ఖమ్మంలో పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది



దానవాయిగూడెం ఎంజేపీలో పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థినులు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 17: భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 73 పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. మొత్తం 12,341 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. 73 చీఫ్ సూపరింటెండెంట్లు, 73 డిపార్ట్‌మెంటల్ అధికారులు, 720 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల సమీపంలోని జిరాక్సు షాపులు, కంప్యూటర్ సెంటర్లు మూసే ఉంటాయి. ఇతర వివరాలకు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావును 99890 27943లో సంప్రదించాలని డీఈవో వెంకటేశ్వరచారి సూచించారు.

### ఖమ్మం జిల్లాలో..

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 17: ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 97 పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి 16,577 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యాశాఖ జిల్లాను 53 జోన్లుగా విభజించింది. 97 సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలు, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు పరీక్షలను పర్యవేక్షించనున్నాయి. 1,983 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల విధులు నిర్వర్తించనున్నారు.

### పది పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

కొత్తగూడెం క్రైం, మార్చి 17: పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఉంటుందని పేర్కొన్నారు.



కొత్తగూడెంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

### విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

#### భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



పదోతరగతి విద్యార్థులకు భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల ఆదివారం ఓ ప్రకటనలో 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా అదనపు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల అనుమతి ఉండదన్నారు.

### విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

#### డీఈవో వెంకటేశ్వరచారి



విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని డీఈవో వెంకటేశ్వరచారి సూచించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థుల హాల్ టిక్కెట్లను ఆపాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్షలు జరుగుతాయన్నారు.

# అధిక లోడు.. జనం గోడు

## (పట్టించుకున్న నాథుడే లేడు)

- అతివేగం, అధికలోడుతో వెళ్తున్న కేవోసీ బొగ్గు లారీలు
- రోడ్డుపై నిత్యం జారిపడుతున్న బొగ్గు పెళ్లలు
- దుమ్ముతో అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు
- రక్షణ చర్యలు చేపట్టని సింగరేణి అధికారులు



అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్



రోడ్డు పక్కన పడిఉన్న బొగ్గు

టేకులపల్లి, మార్చి 17 : ఏండ్ల తరబడిగా తమ గోడును పట్టించుకునే నాథుడు లేక టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు గోస పడుతున్నారు. బొగ్గు రవాణా లారీలు అతివేగం, అధిక లోడుతో వెళ్తుండడంతో అనేక సమస్యలు వారిని పట్టిపీడిస్తున్నాయి. వివరాల్లోకెళ్తే.. కోయగూడెం ఉపరితల గని నుంచి ఇల్లెందు, పాల్వంచ, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు బొగ్గు లారీలు నిత్యం తిరుగుతుంటాయి. సింగరేణి వారి ఆధ్వర్యంలో టెండర్ల ద్వారా పలు కంపెనీలకు బొగ్గు రవాణా జరుగుతూ ఉంటుంది. అయితే టెండర్ యజమానులు నిబంధనలను పాటించడం లేదు. లారీల లోడు విషయంలో నిబంధనల ప్రకారం 14 టైర్ల టిప్పర్‌లో 28 టన్నుల బొగ్గు, 12 టైర్ల టిప్పర్‌లో 23 టన్నుల బొగ్గు మాత్రమే రవాణా చేయాల్సి ఉంటుంది. మంచి కండీషన్ ఉన్న లారీలనే ఉపయోగించాలని సింగరేణి యాజమాన్యం టెండర్లలో పేర్కొన్నది. కానీ కేవోసీ అధికారులు, టెండర్ యజమానులు, లారీల యజమానులు కుమ్మక్కై నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. కండీషన్‌తో సంబంధం లేకుండానే లారీల్లో 32 నుంచి 40 టన్నుల బొగ్గును లోడు చేసుకొని రోడ్డుపై అతివేగంగా తిరుగుతున్నారు. దీంతో లారీ నుంచి బొగ్గు పెళ్లలు కింద పడి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారుతున్నది. లారీలు అతివేగంగా వెళ్తుండడంతో దుమ్ము విపరీతంగా పైకిలేచి ఇళ్లల్లోకి వస్తున్నది. పెట్రాంచెలక స్టేజి, తుమ్మలచెలక స్టేజి, అంజనపాలెం, అదుగులగూడెం, దాస్ తండా, రేగులతండా, బోడురోడ్డు సెంటర్, టేకులపల్లి, తడికపూడి క్రాస్‌రోడ్డు, గోలియా తండా గ్రామాల ప్రజలు ఈ దుమ్ముతో చాలా ఇబ్బంది పడుతున్నారు. అనేక అనారోగ్య సమస్యలను సైతం ఎదుర్కొంటున్నారు. ఇంతా జరుగుతున్నా ఏండ్ల తరబడి తమ గోడును ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పుకుంటున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై సింగరేణి పీవో ప్రహ్లాద్‌ను 'నమస్తే' వివరణ కోరగా లారీల్లోకి బొగ్గును లోడ్‌చేసే క్రమంలో కొంత హెచ్చుతగ్గులు ఉంటాయని, అధిక లోడుతో వెళ్తున్న లారీల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుమ్ము లేవకుండా రక్షణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

### పెద్ద సార్లు పట్టించుకోవాలి



నా పేరు భూక్యా సీతమ్మ. మాది తుమ్మలచెలక స్టేజి. గత 20 సంవత్సరాలుగా కోయగూడెం ఓసీ నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు తీసుకెళ్తున్న లారీలు, టిప్పర్లు మా ఊరు మీదుగా ప్రతిరోజు వెళ్తుంటాయి. గ్రామంలో కూడా లారీలు అతివేగంగా వెళ్తున్నాయి. అతివేగం, అధికలోడు వల్ల బొగ్గు పెళ్లలు రోడ్డుపై పడి వాటిని మరో లారీ తొక్కడంతో ఆ బొగ్గు దుమ్ము లేచి ఇంట్లో వస్తువులపై చేరుతున్నది. దుమ్మును పీల్చడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. పెద్ద సార్లు పట్టించుకుంటే బాగుంటుంది.

### హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేయాలి



నా పేరు తేజవత్ మోతిలాల్. మాది పెట్రాంచెలక స్టేజీ గ్రామం. కోయగూడెం ఓసీకి దగ్గర ఉన్న మా ఊరి మీదుగా ప్రతిరోజు బొగ్గు లారీలు వెళ్తుంటాయి. సింగరేణి అధికారుల దృష్టికి ఎన్నోసార్లు మా సమస్యలు తీసుకెళ్లాం. దుమ్ము లేవకుండా ప్రతిరోజు నీరు పోస్తాం, లారీల నుంచి జారిపడిన బొగ్గును తీసేస్తాం అని చెబుతున్నారే కానీ చేయడం లేదు. ప్రతి నెలా హెల్త్‌క్యాంపులు కూడా ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా తమ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. అసలు లారీలు సరిపడా లోడుతో వెళ్తే సమస్యలు తగ్గిపోతాయి.

# ఎన్నికల నేపథ్యంలో కొత్తగా చెక్‌పోస్టులు




మణుగూరు టౌన్: ఎస్ఎస్టీ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

మణుగూరు టౌన్, మార్చి 17: లోక్‌సభా ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఆదివారం పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు, గుండాల మండలంలోని పలుచోట్ల చెక్‌పోస్టులు ప్రారంభించారు.

### మోరంపల్లి బంజర్‌లో చెక్‌పోస్టు

సారపాక, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం రెవెన్యూ అధికారులు మోరంపల్లిబంజర్‌లో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. డబ్బు, మద్యం అక్రమ తరలింపును నిరోధించేందుకే చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ముజాహిద్ మీడియాకు తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్ఐలు నర్సింహారావు, ముత్తయ్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# మండే ఎండ.. చేపల వేట

పచ్చని పొలాల మధ్య చెరువు.. నెత్తిని మండించే ఎర్రటి ఎండ.. అయినా సమీప గ్రామాలకు చెందిన ప్రజలు లెక్కచేయడం లేదు. వలలు, తెరలు, గుమ్ములతో చెరువులోకి దిగారు. జల పుష్పాలు పట్టుకునేందుకు పోటీపడ్డారు. చేతికి అందిన చేపలను బుట్టల్లో వేసుకుని ఆనందోత్సాహాలతో ఇండ్లకు తిరిగి వెళ్లారు. ఈ చిత్రాన్ని ఆదివారం కరకగూడెం మండలం తాటిగూడెం చెరువు వద్ద 'నమస్తే' బంధించింది. - కరకగూడెం, మార్చి 17



### పెద్దమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పాల్వంచ రూరల్, మార్చి 17: మండలంలోని పెద్దమ్మ తల్లి దేవాలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు అన్నప్రాసన, వాహన పూజలు చేయించారు. తలనీలాల సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం పర్యవేక్షించారు. ఆలయ నిర్మాణానికి జూలూరుపాడు మండలం కాకర్లకు చెందిన శ్రీనివాస్-రూపశ్రీ దంపతులు రూ.50,116, కేటీపీఎస్‌కు చెందిన అశోక్ కుమార్ దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు.

### ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ వేయాలి



సమావేశంలో పాల్గొన్న ఉద్యమకారులు

కొత్తగూడెం అర్బన్, మార్చి 17: 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అసలైన ఉద్యమకారులను గుర్తించి, న్యాయం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శాంతిరాం ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగూడెంలోని మార్వాడీ సత్రంలో ఆదివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరెడ్డి, సత్యనారాయణరాజు, ఆవుల కృష్ణ, కృష్ణార్జున్‌రావు, కేశవరావు, చింతలచెర్వు గెర్షోమ్, గంగుల రామారావు, బలరాం సింగ్, మల్లేష్, సత్తార్, వెంకటరామారావు, నాగభూషణం, భీమయ్య, కాశీవిశ్వేశ్వరరావు, అసన్‌ఖాన్, చాంద్‌సాబ్, అందె సమ్మయ్య, హనుమంతరావు, సీతారాంరెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆదివాసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్, మార్చి 17: నియోజకవర్గవ్యాప్తంగా ఆదివాసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని తోగ్గూడెం సమ్మక్క-సారలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం సింగరేణి ఆదివాసీ ఉద్యోగులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సింగరేణి మణుగూరు ఏరియా ఎస్వోటూ జీఎం వీసం కృష్ణయ్య, పీకేవోసీ అండర్ మేనేజర్ వాడే అప్పారావు, ఆదివాసీ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### రామయ్యకు స్వర్ణ పుష్పార్చన



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, మార్చి 17: భద్రాచలం దివ్యక్షేత్రం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు ఆదివారం స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. నిత్య కల్యాణమూర్తులకు బేడా మండపంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.





